

6న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 6న ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిఎంసి బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా పరిషత్ సిఇఒ ఎ.శ్రీరామ చంద్రమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీన నిర్వహించే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘ సమావేశాలకు గౌరవ సభ్యులు అందరూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా (కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల) వివిధ శాఖల అధికారులు ఉదయం 10:30 గంటలకు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సమస్యలపై ఆశాల ధర్నా

ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పిహెచ్‌సిల వద్ద ఆందోళన నిర్వహించి వైద్యాధికారులకు వినతిపత్రం సమర్పించారు. పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని, లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు వేయాలి, సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ కాకినాడ ప్రతాప్ నగర్, నేతాజీ పార్క్ పిహెచ్‌సిలో జరిగిన ధర్నాలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ మాట్లాడారు. దేశవ్యాప్తంగా సంచలన సష్టించిన కలకత్తా వైద్యురాలిపై అత్యాచారం హత్య చేసిన నిందితులను కాపాడే ప్రయత్నం అక్కడి మమతా బెనర్జీ ప్రభుత్వం చేయడం సిగ్గుచేటన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా మహిళలు పని చేసే ప్రదేశాలన్నిటిలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు తక్షణం ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించాలని సూచించారు. పెరోల్‌పై విడుదలైన డేరా బాబా లాంటి రేపిస్టులకు కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించి రక్షిస్తుంటే దేశంలో మహిళలకు రక్షణ ఎలా దొరుకుతుందని ప్రశ్నించారు. గుడ్లవల్లేరు సంఘటనపై పోలీసులు భాదితులైన విద్యార్థినులను బెదిరించడం ఆపాలని, తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. రాజకీయాలకతీతంగా అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించేందుకు దేశవ్యాప్తంగా సమగ్ర చట్టం చేయాలన్నారు. 2024 ఫిబ్రవరి 9వ తేదీన ఆశ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వానికి జరిగిన ఒప్పందం మేరకు జిఒలు, సర్క్యులర్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధరలకనుగుణంగా ఆశాలందరికీ కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షురాలు పద్మావతి కె.వేణు, పి.జ్యోతి, బి.రాణి, ఎల్.లీలావతి, వై.రమాదేవి, రెడ్డి సత్యవతి, సిహెచ్.వేణి, ఎం.అమ్ములు, మాలకా నాగలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, డి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ ధర్నాలో మాట్లాడుతున్న బేబిరాణి

ఆశాలు నిరసన వ్యక్తం చేశారు, అనంతరం స్థానిక వైద్యాధికారి నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఇ.చంద్రావతి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనలో లలిత, దివ్య, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ తూరంగి, పండూరు పిహెచ్‌సిల వద్ద ఆందోళన నిర్వహించారు. డాక్టర్ వసుంధరకు వినతిపత్రం అందించారు. సిఐటియు మండల కన్వీనర్ టి.రాజా, సహాయ కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ, ఆశాలు విమల, బేబీ, అరుణ, పద్మ, ధనలక్ష్మి, రేష్మ, నాగలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

పెద్దాపురం మండలం పులిమేరు, కాండ్రకోట పిహెచ్‌సిలు, అర్బన్ పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్స్ ధర్నా నిర్వహించారు. అనంతరం వైద్యాధికారులకు వినతి పత్రం అందజేశారు. నాయకులు ఈశ్వరి, దాడి బేబీ, నాగరత్నం, సీత, వరలక్ష్మి, నాగమణి, జె.లోవలక్ష్మి, ప్రమీల, దుర్గ, చంటి, లక్ష్మీ కుమారి, పద్మ, సౌమ్య, సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి మండలంలోని పెద్దాడ, సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశ వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆశ వర్కర్ల యూనియన్ కార్యదర్శి చంద్రమల్ల పద్మ మాట్లాడారు. వైద్యాధికారులు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సురేఖ, డాక్టర్ శిరీషకు వినతిపత్రాలు అందించారు. వల్లూరి ఉమావతి, వీరలక్ష్మి, సత్యవతి, సుశీల, రోజా, మణి, తెల్లమ్మ పాల్గొన్నారు.

కోటనందూరు సిఐటియు మండల కార్యదర్శి షేక్ పద్మ ఆధ్వర్యంలో పి.కొట్టం గ్రామం ప్రాథమిక వైద్యశాల వద్ద ఆశా వర్కర్లు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మరియారత్నం, సత్యవతి, కృష్ణవేణి, పి.వెంకటలక్ష్మి, బి.సత్యవతి, కమలా రాణి, నూకరత్నం, అమ్మాజి, లక్ష్మీరత్నం, నూకరత్నం, వెంకటలక్ష్మి, మహాలక్ష్మి, రాజేశ్వరి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నల్ల బ్యాడ్జీలతో


కోటనందూరులో..


పెద్దాపురంలో..



పెద్దాపురంలో..



గండేపల్లిలో..

భారీ వర్షం నష్టాల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గంపేట, పెద్దాపురం, సామర్లకోట

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జగ్గంపేట మండలంలోని సుమారు 400 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని మండల వ్యవసాయాధికారి ఆర్.శ్రీరామ్ తెలిపారు. తహశీల్దారు జెవిఆర్.రమేష్‌తో కలిసి మంగళవారం జగ్గంపేట, రామవరం గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. వరి పంట నాట్లు వేసి 20 నుండి 40 రోజులు అయ్యిందని వీలైనంత తొందరలో నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. నాలుగు రోజులు పైబడి నీరు నిల్వ ఉంటే నష్టం తీవ్రత అధికమయ్యే ప్రమాదం ఉందన్నారు. పంట పిలకలు కట్టే దశలో ఉన్నందున నీరు తీసిన వెంటనే బూస్టర్ దోషిగా ఎకరాకు 20 కిలోలు, యూరియా 20 కిలోలు మ్యురేట్ ఆఫ్ పొటాష్ చేయాలన్నారు.


జగ్గంపేటలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న సిబ్బంది

పెద్దాపురం డివిజన్‌లో 20 ఇళ్లు ధ్వంసం

ఇటీవల కురిసిన తుపాను వర్షాలకు పెద్దాపురం డివిజన్ పరిధిలో 9 ఇళ్లు పూర్తిగా, 11 ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని ఆర్‌డిఒ జె.సీతారామారావు తెలిపారు. డివిజన్ పరిధిలో ప్రాథమిక పరిశీలనలో 2,500 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు నివేదికలు అందాయన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పంట నష్టం, చెరువులు, కాలువలు, ఇతర నష్టాలపై పరిశీలన చేశామన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

సామర్లకోట మండలం పవర, పండ్రవాడ, చంద్రంపాలెం, సామర్లకోట, నవర గ్రామాల్లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.రత్నప్రశాంతి, మండల వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య వర్షాల ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వరి పంట పిలకలు తొడిగే దశలో ఉన్నందున రైతులు అందరూ పొలంనుండి వెంటనే నీటిని బయటికి తీసివేసి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

చెకుముకి సైన్స్ సంబరాలు 2024-25 పోస్టర్‌ను డిఇఒ పిల్లి రమేష్ మంగళవారం ఆవిష్కరించారు. కాకినాడ జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు అందరూ పాల్గొని సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేలా కృషి చేయాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షుడు మేకా సుబ్బారావు డిఇఒకు ధన్యవాదాలు తెలిపారు. అధ్యక్షుడు కెఎంఎంఆర్.ప్రసాద్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు 6, 7 తరగతులు జూనియర్స్‌గా పాఠశాల, మండల, జిల్లా స్థాయిలు గాను, 8, 9, 10 తరగతులు సీనియర్స్‌గా పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరుగుతాయని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, డిసిఇబి చైర్మన్ వెంకట్రావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్ వినీల్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సత్తిరాజు, రాష్ట్ర కమిటీ సభ్యుడు జిఎస్‌హెచ్‌పి.వర్మ, ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు


పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో మేజర్ డ్రైన్ల పూడిక తీత పనులు సక్రమంగా అమలు చేయాలని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆదేశించారు. పట్టణంలో పలు మేజర్ డ్రైన్ల పూడికతీతకు సంబంధించిన పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. చిన్నపాటి వర్షాలకు డ్రైన్లు పొంగి రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందిని గుర్తించి మేజర్ డ్రైన్లలో పూడికతీత పనుల నిమిత్తం సుమారు రూ.36 లక్షల నిధులను తీసుకువచ్చి పనులను వేగవంతం చేయింయినట్టు ఆయన తెలిపారు. సామర్లకోట స్టేషన్ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్ మేజర్ డ్రైన్లలో పూడికతీత పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ అనంతలక్ష్మి, టిడిపి పట్టణ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, భీమేశ్వరాలయం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్, కౌన్సిలర్ బలుసు వాసు, వల్లూరి దొరబాబు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- సామర్లకోట

మండలంలో పెండింగ్‌లో ఉన్న ఎన్‌టిఆర్ ఆవాస్ యోజన పథకంలో నిర్మించే పెండింగ్ గృహాలను, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌వివి సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌టిఆర్ హౌసింగ్ నిర్మాణాలపై మండల పరిధిలోని పంచాయితీ కార్యదర్శులు, హౌసింగ్, వెలుగు సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ డి.శ్రీలలిత అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఇఇ వై.శ్రీనివాస్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, హౌసింగ్ ఎఇ మహమ్మద్ ముస్తాక్, మొహిద్దీన్, ఉపాధిహామీ ఎపిఒ ప్రభాకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ హౌసింగ్ బిల్లుల పెండింగ్ విషయంలో జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో గహ నిర్మాణల తాజా పరిస్థితిపై సిబ్బందిని సమీక్షించి వివరాలు సేకరించారు. లబ్ధిదారులు కొందరు స్థానికంగా అందుబాటులో లేరని, కొందరు వారి ఆర్థిక ఇబ్బందుల కారణంగా పనులు చేయించుకోలేక పోతున్నామని చెబుతున్నారని, కొందరు లబ్ధిదారులు మరణించారని వివరణిచ్చారు. దానికి అధికారులు మాట్లాడుతూ మొదట లబ్ధిదారుల జియో టాగ్ పూర్తి చెయ్యాలాన్నారు. మైగ్రేషన్ ఉన్నవారికి సంబంధించి వారు ఎక్కడ ఉంటున్నారో తెలుసుకుని వారిని సంప్రదించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కాజులూరు

సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం పంపాల కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కాజులూరు ఉన్నత పాఠశాలకు అవసరమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను పైప్ లైన్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు రూ.10 లక్షలతో మేనేజింగ్ డైరెక్టర్ అఖిల్ మల్‌హోత్రా, చీఫ్ ఆపరేటివ్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ చౌహాన్ ద్వారా అందజేశారు. హెచ్ఎం పంపన కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు అభివద్ధి చెందడం కోసం ఈ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అన్నివిధాలుగా ఉపయోగపడుతుందని తెలిపారు. సీనియర్ జనరల్ మేనేజర్ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ప్రగతిని కనబరుచుతూ ఉన్నంతకాలం విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉంటామని తెలిపారు. చీఫ్ మేనేజర్ అంకుర్ మల్లిక్ మరో మేనేజర్ వల్లీ నూర్ బాషా మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.డేవిడ్, పి.జాన్, శామ్యూల్ బెన్ హర్, కెవివి.సత్యనారాయణ, స్టాఫ్ సెక్రటరీ హరినాథ్, చింతా నారాయణ మూర్తి, సునీలా దేవి, బాషా, రవి కౌర్, షటిల్ మూర్తి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

విశాఖ నుంచి విజయవాడకు రైలు

ప్రజాశక్తి -సామర్లకోట

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సుమారు 31 రైళ్లు రద్దవగా రైల్వే ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉండటంతో విశాఖపట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రత్యేక రైలు మంగళవారం సామర్లకోట రైల్వే స్టేషన్ మీదగా ప్రయాణించింది. మధ్యాహ్నం మూడు గంటల 15 నిమిషాలకు ప్రత్యేక రైలు సామర్లకోట చేరుకుంది. ఈ సందర్భంగా సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ మాట్లాడుతూ 08581 నెంబరు గల రైలు విశాఖపట్నం నుండి బయలుదేరి విజయవాడ వెళుతుందన్నారు. ఈ రైలు విశాఖపట్నంలో మంగళవారం మధ్యహ్నం 12:55 గంటలకు బయలుదేరి దువ్వాడ, అనకాపల్లి, తుని, అన్నవరం, సామర్లకోట జంక్షన్, అనపర్తి, రాజమండ్రి, నిడదవోలు జంక్షన్, తాడేపల్లిగూడెం, ఏలూరు, నూజివీడు మీదుగా విజయవాడ రాత్రి 19:15 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ సేవలను ప్రయాణికులు అధిక సంఖ్యలో ఉపయోగించుకున్నట్టు స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.



సామర్లకోట చేరుకున్న విజయవాడ వెళ్లే ప్రత్యేక రైలు

ప్రభుత్వాసుపత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి-రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడి పిహెచ్‌సిని డిసిహెచ్ఎస్ డాక్టర్ స్వప్న మంగళవారం తనిఖీ చేశారు. శృంగవరం గ్రామానికి చెందిన డయేరియా రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను వైద్యులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ జానకి దేవి, డాక్టర్ పావని బృందంతో సమావేశమై పలు సూచనలు చేశారు.

కార్టూ'నిజం'





రోగులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యప్రభ

రౌతులపూడి ఆసుపత్రి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-రౌతులపూడి

రౌతులపూడి పిహెచ్‌సిని 30 పడకల నుంచి 50 పడకల ఆసుపత్రిగా అభివద్ధి చేయడానికి కృషి చేస్తానని ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలో శృంగవరం గ్రామానికి చెందిన డయేరియా రోగులను ఆమె పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణం పూర్తి చేయకుండా అసంతప్తిగా ఉన్న భవనాలను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని వైద్యాధికారి డాక్టర్ జానకి దేవిని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల ఇబ్బందులను బలరామపురం ఎంపిటిసి సోమరౌతు రవి ఎంఎల్ఎ సత్యప్రభ దృష్టికి తీసుకువచ్చారు. తొలుత ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులకు పండ్లు. రొట్టెలు పంపిణీ చేశారు. ఎంఎల్ఎ వెంట గంటిమల్ల రాజ్యలక్ష్మి, పైల సాంబశివరావు, పర్వత సురేష్ పాల్గొన్నారు.

యనమల రాజేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కోటనందూరు

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యనమల రాజేష్ పుట్టినరోజు సందర్భంగా అన్నవరం సమీపంలోని వన్ రెస్టారెంట్లో మంగళవారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో కోటనందూరు, తుని, తొండంగి మండలాల్లో యువకులు, పార్టీ అభిమానులు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. తుని ఏరియా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొని యువత యువకుల నుంచి భారీగా రక్త సేకరణ నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షంలో యనమల రాజేష్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మోతుకూరు వెంకటేష్, సుర్ల లోవరాజు, ఇనగంటి సత్యనారాయణ, మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్ బాబు, గాడి రాజబాబు, అంకమరెడ్డి బుల్లిబాబు, లగుడు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న యనమల రాజేష్

జనసేన పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-తాళ్లరేవు, యు.కొత్తపల్లి

ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని చొల్లంగిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు భోజనాలు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం కార్యక్రమంలో భాగంగా సోమవారం హైస్కూల్లోని 404 మంది విద్యార్థులకు చికెన్ బిర్యానీ, పండ్లతో కూడిన భోజనం వడ్డించారు. చొల్లంగి, చొల్లంగిపేట పాఠశాలల్లో విద్యార్థులకు గణిత టేబుల్స్ పుస్తకాలు, పెన్స్ అందజేశారు. ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. అనంతరం ఆయన మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఏసూరి వరప్రసాద్, స్వర్ణ లోవరాజు, కొత్తగళ్ల గోవిందు, మందాల సురేష్, కందెల్ల శ్రీను, స్వర్ణ శ్రీను, ఏసూరి బయన్న, వీరబాబు, వెలుగుబంట్ల వెంకట సూర్యనారాయణ, అంకన ఆంజనేయులు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నట్టు ఎంపీ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. సూరాడపేట పాఠశాలలో ఉన్న 140 మంది విద్యార్థులకు జనసేన కార్యకర్తలు సొంత నిధులతో కొనుగోలు చేసిన భోజనం ప్లేట్లు, పెన్నులు, పెన్సిళ్లను ఆయన పంపిణీ చేశారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు నాడు పాఠశాల సెలవు కావడంతో విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. అనంతరం పాఠశాలలో ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభించారు. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, రావు అక్షయ్, సానా నాగు, గంటా విజయ్‌కుమార్, మామిడి సూరిబాబు, బాబి, చింతలపూడి వెంకటరమణ, గవర రాంబాబు, బాపన దొర పాల్గొన్నారు


సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ మౌనిక

ఆత్మరక్షణపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థి దశ నుండి ప్రతి బాలికా ఆత్మ రక్షణ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని పెద్దాపురం ఎస్ఐ మౌనిక అన్నారు. మంగళవారం పెద్దాపురం మండలం కొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రామ సర్పంచ్ కొత్త చక్కర రావు అధ్యక్షతన బాలికల ఆత్మ రక్షణ పద్ధతులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి బాలికా చిన్ననాటి నుంచి క్రమశిక్షణ, ధైర్యం అలవర్చుకోవాలన్నారు. మహిళలు, బాలికలకు సంబంధించిన చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న 12 మంది అరెస్ట్

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని రాజవరం గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్ఐ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో మంగళవారం దాడి చేశారు. ఈ సందర్భంగా 12 మంది పేకాడుతున్న వారిని అరెస్టు చేశామని, వారు వద్ద నుంచి రూ.8990 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ విలేకరులకు తెలిపారు

వ్యభిచార గృహంపై దాడి

ప్రజాశక్తి-తాళ్లరేవు

కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం నీలపల్లి జగనన్న కాలనీలో మంగళవారం వ్యభిచారం గృహం పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడుల్లో నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలను, ఒక పురుషుడినీ కోరంగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ప్రజలు ఫిర్యాదు మేరకు కోరంగి ఎస్ ఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జగనన్న కాలనీలో ఒక గృహం పై దాడి చేయగా ముగ్గురు పట్టు బడ్డారు. గత కొంతకాలంగా నీలపల్లి పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీలో యానాం మెట్టకూరు కి చెందిన ఒక మహిళ వ్యభిచారం నిర్వహిస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం పోలీసులు నేరుగా దాడి చేయగా ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకున్నారు.

వ్యక్తి పై కత్తితో దాడి

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక పాదగయ జంక్షన్ బై పాస్ రోడ్డు పై ఒక వ్యక్తిపై మంగళవారం కత్తితో దాడి జరిగింది. ఘటనపై బాధితుడు కె సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం తాను గతంలో కొంతమంది వ్యక్తులతో కలిసి చిట్ ఫండ్ కంపెనీ నిర్వహించనన్నాడు. కంపెనీ భాగస్వాములకు తనకు మధ్య వివాదాలు తలెత్తాయన్నాడు. ఈ విషయంపై పట్టణ పోలీస్ స్టేషన్, జిల్లా ఎస్పి కార్యాలయంలో ఫిర్యాదు చేశానన్నారు. తాను మంగళవారం సాయిబాబా గుడి వద్ద ఉండగా చిట్ ఫండ్ కంపెనీ భాగస్వాములలో ఒకరైన భాస్కర్‌రావు తను సామర్లకోట వెళ్ళాలని పాదగయ జంక్షన్ వద్ద దించమని అడగాడని తెలిపాడు. ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా పాదగయ జంక్షన్ సమీపానికి వచ్చేసరికి బండిపై వెనక కూర్చున్న భాస్కర్ రావు తన పై కత్తితో ఒక్కసారిగా దాడి చేసి తన వద్ద ఉన్న నగదు బ్యాగును తీసుకొని పరారయ్యాడని బాధితుడు సత్యనారాయణ తెలిపాడు. గాయాలు పాలైన బాధితుడు స్థానిక ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి జైలు, ఇద్దరికి జరిమానా

ప్రజాశక్తి-సామర్లకోట

సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు న్యాయమూర్తి జరిమానా, మరో ఇద్దరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ పివిఎస్.మూర్తి మంగళవారం తెలిపారు. ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డ్రంక్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా నలుగురు మందుబాబులు పట్టుబడ్డారన్నారు. వారిని కాకినాడ స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి నరసింహారావు ముందు హాజరు పరచగా వారికి జరిమానా, జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ చెప్పారు.

వివాహిత ఫిర్యాదుపై కేసు నమోదు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పరాయి వ్యక్తితో మాట్లాడుతున్నాననే నెపంతో అక్రమ సంబంధం అంటగట్టి తమ అత్తింటి వారు, గ్రామ పెద్దల సమక్షంలో బలవంతపు వివాహం చేయించారని ఓ వివాహిత చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇవి.. తానేలంక చిన్న పేట కు చెందిన మెల్లం దయామణి అదే గ్రామంలోని ఉన్నత పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తుంది. ఆమె భర్త నాగార్జున కూడా అదే పాఠశాలలో వాచ్ మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున తన ఉద్యోగ విషయమై వాకింగ్ వెళ్తున్న అదే గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు వివాహితుడు అయిన ఇసుకపట్ల ఈశ్వర్ కుమార్‌తో మాట్లాడుతోంది. అది చూసిన అత్తింటి వారు తనకు అతనికి అక్రమ సంబంధం అంటగట్టి పెద్దల సమక్షంలో తగువుపెట్టి తనకు ఈశ్వర్ కుమార్ కు అంబేద్కర్ విగ్రహం వద్ద బలవంతంగా వివాహం జరిపించారని దయామణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమ వసూలుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

మండల మాల మహానాడు పేరిట కొంతమంది వ్యక్తులు పలువురు నుంచి అక్రమంగా సొమ్ములు వసూలు చేశారని ముమ్మిడివరం మాల మహానాడు జెఎసి నాయకులు మంగళవారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 21న భారత్ బందు పిలుపు మేరకు ముందు రోజు కొంతమంది వ్యక్తులు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రయివేటు ఆసుపత్రులు, వ్యాపార సంస్థలు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి తదితరులు నుంచి సుమారు రూ.70 వేల నుంచి రూ.80 వేలు వరకు వసూలుకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో సిసి కెమెరా ఫుటేజ్ ల ఆధారంగా అక్రమ వసూలుకు పాల్పడిన వ్యక్తులను గుర్తించామని, వారిపై చర్యలు తీసుకోవాలని మండల మాల మహానాడు జెఎసి నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బెల్లపు ఊట స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లపూడి

గోపాలపురం, తాళ్లపూడి మండల సరిహద్దులో పోలీసులు దాడులు నిర్వహించి 200 లీటర్ల చొప్పున బెల్లపు ఊటను నిల్వ ఉంచిన 40 పీపాలను స్వాధీనం చేసుకున్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలవ గట్టు సమీపంలో వీటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి యజమానులు ఎవరిన్నది తెలియలేదని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఉద్యోగ భద్రత కోసం బెవరేజెస్ సిబ్బంది వినతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, గండేపల్లి



రాజమహేంద్రవరంలో డిఎంకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ నెల 7న శాంతియుతంగా బంద్ నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తూర్పు గోదావరి, కాకినాడలో పలువురు అధికారులకు వినతిపత్రాలు అందించారు. రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్స్, సేల్స్‌మెన్, వ్యాచ్‌మెన్‌లు కలిసి డిపో మేనేజరుకు వినతిపత్రం అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్‌పిలకు వినతిపత్రాలు అందించారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో తమ ఉద్యోగాలకు ఎటువంటి హామీ ఇవ్వని కారణంగా బంద్ చేపట్టినట్టు తెలిపారు. 2019లో 3,600 మద్యం దుకాణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు చేసి 18 వేల మంది సిబ్బందికి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో జీవనోపాధి కల్పించారన్నారు. దీంతో తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఒక్కసారిగా తమను తొలగిస్తే ఎలా బతకాలని ప్రశ్నించారు. కరోనా సమయంలో తమ ప్రాణాలకు లెక్కచేయక విధులు నిర్వహించామని గుర్తు చేశారు. కాకినాడ జిల్లా గండేపల్లిలో తహశీల్దారు, ఎస్‌ఐలకు వినతిపత్రాలు అందించారు.

సాంకేతిక విద్యతో బంగారు భవిత

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సాంకేతిక విద్య ద్వారా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందని విప్రో టీమ్ లీడర్ డి.వసంత కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కెరియర్ గైడెన్స్ అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచమంతా కంప్యూటర్‌పై ఆధారపడి నడుస్తోందని, కంప్యూటర్ విద్య విద్యార్థులకు అవసరమని తెలిపారు. కంప్యూటర్ రంగంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాల గురించి, వివిధ రకాల కంప్యూటర్ కోర్సులు గురించి ఆయన వివరించారు. ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యుత్‌తో పాటు కంప్యూటర్‌పై అవగాహన పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-యానాం



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తన ఎంఎల్ఎ నిధుల నుంచి సుమారు రూ.62 లక్షల నిధులు పిడబ్ల్యూడి, మున్సిపాలిటీ ద్వారా రోడ్లు, డ్రయిన్‌ల నిర్మాణానికి గతంలో నిధులు కేటాయించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక బెజవాడ గార్డెన్‌లో డ్రెయిన్లు, రోడ్లు, కల్వర్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యూడి ఎఇ కాళ్ళ నాగరాజ్, మున్సిపల్ సిబ్బంది , కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సత్యదేవుని ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఎఐ గుర్తింపు

ప్రజాశక్తి-అన్నవరం



అధికారులను అభినందించిన ఎంఎల్ఎ సత్య ప్రభ

అన్నవరం సత్య నారాయణ స్వామి ప్రసాదానికి భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ (FSSAI) గుర్తింపు లభించడం పట్ల ప్రత్తిపాడు ఎంఎల్ఎ మరుపుల సత్యప్రభ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అన్నవరం కొండపై ఎంఎల్ఎ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఎల్ఎ సత్యప్రభ మాట్లాడారు. సత్యనారాయణ స్వామి ప్రసాదానికి స్వచ్ఛత, నాణ్యత, తియ్యదనంలో దేశఖ్యాతి లభించడం అభినందనీయం అన్నారు. ఆలయ సిబ్బందిని, పాలక వర్గాన్ని ఆమె అభినందించారు.

పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో వాహనాల వేలం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలోని పోర్టు పోలీస్ స్టేషన్లో మూడు కేసుల్లో పట్టుబడ్డ రెండు ఫైబర్ పడవలను, ఒక మోటార్ సైకిల్‌కు మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఈ మూడింటికి 18 శాతం జిఎస్‌టితో కలిపి రూ.లక్షా 59 వేలకు ముగ్గురు పాటదారులు వాటిని దక్కించుకున్నారని పోర్టు పోలీస్ స్టేషన్ సిఐ పి.సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో ఈ వేలం నిర్వహించారు. ఒక బోటును రూ.66 వేలకు చేట్ల వెంకటరెడ్డి, మరో బోటును రూ.45 వేలకు సంగాడి ఈశ్వరరావు, బైకును రూ.24 వేలకు కర్రి త్రిమూర్తులు దక్కించుకున్నారు. ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ ఎఎస్.దొర, 27 మంది పాట దారులు హాజరయ్యారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఒక వ్యక్తి నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి చూపునిచ్చినవారవుతారని తాళ్లరేవు మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో శ్రీనివాస్ మాట్లాడారు. మరణించిన వ్యక్తి నుంచి 6 గంటల్లోపు నేత్రం నుంచి కార్నియాను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాకపల్లి చిరంజీవి, గంజా సూరిబాబు, కుడుపూడి దుర్గాప్రసాద్, కాంద్రేకుల శ్రీనివాస్, వడ్డి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో పాల్గొన్న ఎంఎల్ఎలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విజయవాడలో వరద ప్రాంతాల్లో బాధితులకు సహాయక చర్యలు అందించి, వారికి అండగా నిలిచేందుకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధిన పలువురు ప్రజాప్రతినిధులు అక్కడకు మంగళవారం వెళ్లారు.

అమలాపురం: విజయవాడలో బాధిత కుటుంబాలకు సహాయక చర్యలు అందించి, వారికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంఎల్ఎలకు ఆదేశాలు జారీచేశారు. అందులో భాగంగా విజయవాడ 19 వ డివిజన్ లో వరదలో నీట మునిగిన ప్రాంతాలను అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్రమంత్రి గుమ్మడి సంధ్యారాణి, వైజాగ్ జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ లతో కలసి మంగళవారం పర్యటించారు. ఈ పర్యటన లో టిడిపి రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బోళ్ల సతీష్, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దంతులూరి వాసురాజు, ఎస్‌సి సెల్ రాష్ట్ర నాయకులు కోటి తదితరులు ఉన్నారు. **ముమ్మిడివరం:** వర్షాలకు వరదలతో అల్లాడుతున్న భాదితుల సహాయక చర్యల్లో ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొని సేవలందించారు. ఇటీవల కురిసిన వర్షాలతో వరద ఉధతితో అల్లాడుతున్న బాధితులకు సహాయక చర్యలు త్వరితగతిన అందించేందుకు ప్రజా ప్రతినిధులు పాల్గొని సేవలు అందించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మంగళవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పళ్ళ శ్రీనివాస్‌తో కలిసి ముమ్మిడివరం ఎంఎల్ఎ సుబ్బరాజు పాల్గొని విజయ వాడలోని 60 మరియు 61వ డివిజన్ పరిధిలోని బాధితుల సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లాల తరలింపు

ప్రజాశక్తి-అన్నవరం, జగ్గంపేట

విజయవాడలో కురిసిన భారీ వర్షాలతో అతలాకుతలం అయిన వరద బాధితుల సహాయార్థం అన్నవరం దేవస్థానం నుండి పది వేల పులిహోర ప్యాకెట్లు, 42 వేల మంచినీళ్ల ప్యాకెట్లు, లోవ దేవస్థానం, శ్రీ మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం, కోట సత్తెమ్మ తల్లి దేవస్థానం ద్వారా పదివేల పులిహోర ప్యాకెట్లు మొత్తం 20 వేల ప్యాకెట్లు విజయవాడ కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా బాధితులకు 40 వేల బిర్యానీ ప్యాకెట్లను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తరలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ వరదనీటిలో చిక్కుకున్న అనేక కుటుంబాలు, ఇబ్బందులు పడుతున్నాయన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం

ప్రజాశక్తి - తాళ్లరేవు

త్వరలో జరగబోయే నీటి సంఘాల ఎన్నికలకు రైతులు, నాయకులు సమాయత్తం కావాలని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ఆదేశాలు జారీ చేసినట్టు టిడిపి నాయకులు భజన సత్తిబాబు తెలిపారు. మంగళవారం పటవలలో నిర్వహించిన కూటమి నాయకులు, రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పటవల నీటి సంఘం అధ్యక్షునిగా సత్తిబాబును కూటమి నాయకులు, రైతులు ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొత్తూరు కాశీ ఈశ్వరుడు, దంగేటి అన్వేష్, వత్సవాయి రాజబాబు, చెక్క అయ్యారావు, మేకల కృష్ణ, మేడిశెట్టి గోపాలం, పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం, రిజిస్టర్ల తనిఖీ

ప్రజాశక్తి-అంబాజీపేట

చిరుతపుడిలో రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం జిల్లా వ్యవసాయాదికారి వి.బోసుబాబు సందర్శించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. పిఎసిఎస్‌లో ఎరువుల గోదాముల్లో నిల్వలు, స్టాక్ రిజిస్టర్ లు తనిఖీ చేశారు. ఇ కె వై సి ప్రక్రియ పరిశీలించారు. రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. వరితో పాటు కొబ్బరి, అరటి, కూరగాయల పంటలు ఇకెవైసి నమోదు చేయించుకోవాలన్నారు. ఈనెల 15 వరకూ నమోదు చేస్తారని ఆర్‌బికెల్లో సామాజిక తనిఖీ నిమిత్తం అందుబాటులో రైతుల జాబితా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నేతల నాగరాజు, ఎఒ సిహెచ్‌డి.విజయ్ కుమార్, ఎఇఒ డి.దుర్గారావు, రైతులు బి.రామకష్ణ, ఎల్.నాగేశ్వరరావు, కె.సుబ్బారావు, విహెచ్ఎ ఎమ్.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ దాడులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల పెరిగిపోతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగించుకోవాలని స్పార్క్ స్వచ్ఛంద సంస్థ సిఇఒ సాయి ప్రదీప్ పిలుపునిచ్చారు. మండలంలోని యర్రవరంలో మంగళవారం ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ స్పై కెమెరా దాడులు, ఫెడెక్స్ కొరియర్ పేరుతో మోసాలు, లైవ్ హ్యాకింగ్‌లపై వివరించారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ ఇంటర్నెట్, సెల్ ఫోన్ అత్యవసరంగా మారిందన్నారు, ఇదే అదనుగా భావించిన సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ యాప్స్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కాము కష్టపడి సంపాదించుకున్న సొమ్ము కోల్పోవడంతో పాటు, తమ వ్యక్తిగత డేటాను చోరీ చేసి వేధింపులకు గురి చేస్తున్నారని వీటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పార్క్ సంస్థ కోఆర్డినేటర్ ఆదిత్య సాహుల్, సభ్యులు నాగసాయి, సుధీర్, స్వామి సుభాషిణి, విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారు.

ఎంఎల్ఎ నానాజీకి ప్రజల కృతజ్ఞతలు

ప్రజాశక్తి -కరప

కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ సొంత ఖర్చులతో పూడిక తీత, గుర్రపు డెక్క తీయించడంతో ఆయనకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు తమ పంటకు ఎటువంటి నష్టం జరగకపోవడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం అట్లకట్ట గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బండారు మురళి రైతులు మాట్లడారు. గత ప్రభుత్వంలో రైతులు ఎంత మొర పెట్టుకున్నా పంట కాలువ పూడికలను తీయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముద్రగడ రమేష్, ఎలుగుబంటి శ్రీనివాస్, భక్తుల సతీష్, వీరంరెడ్డి ముత్యాలరావు, యడ్ల శ్రీను, పుల్లయ్య ప్రసాద్, బిరుద భాస్కర్, గంటా నానిబాబు, బండారు ప్రసాద్, నక్కా మల్లేశ్వరరావు, మార్కండేయులు పాల్గొన్నారు

అంగరలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం



అంగరలో రక్తదానం చేస్తున్న పలువురు

మండలంలోని అంగరలో వాసవి క్లబ్, ఇంటర్నేషనల్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వాసవి, వనిత, విఒఎస్ పి.వార్నియర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్ళకూరి ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి ఫ్రూట్స్, డ్రింక్స్, డ్రై ఫ్రూట్స్ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్స్ కూడా అందజేశారు. అనంతరం బ్లడ్ బ్యాంక్ నిర్వహణకు వచ్చిన 'వైఎస్ఆర్, జక్కంపూడి రామ్మోహన్‌రావు' బ్లడ్ సెంటర్ డాక్టర్లను క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్లు, సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు ,పాల్గొన్నారు.

విద్యార్థులకు సక్రమమైన ఆహారాన్ని అందించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న ఆహారాన్ని సక్రమంగా అందించాలని ఎస్ఎంసి ఛైర్మన్ గుర్లింక చిన్నా కోరారు. భీమనపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని, బియ్యాన్ని, కోడిగుడ్లను పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణం లో ఆహారాన్ని వండి వడ్డించాలన్నారు ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం,ఎన్. సత్యనారాయణ మూర్తి ఉపాధ్యాయులకు చిన్నా పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

మండలంలోని అన్నంపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద డ్వాక్రా మహిళా సంఘాలకు మంగళవారం జన కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ అద్వర్యం లో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రాష్ట్ర అంగన్ వాడి సాధికార డ్వాక్రా మహిళల ఆర్గనైజింగ్ కార్యదర్శి మెండి కమల ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో మహిళ పాత్ర ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని, అలాగే హెచ్ఐవి, ఎయిడ్స్ ఏ విధంగా వ్యాపిస్తుంది, నివారణ మార్గాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీత, వరలక్ష్మి, సిహెచ్ శాంతి గుర్రాల అమలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ముక్కామల పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి-అంబాజీపేట

ముక్కామల పిహెచ్‌సిని ఎంపిడిఒ జివి.సరోవరావు, ఇఒపిఆర్‌డి బి.మమత మంగళవారం తనిఖీ చేశారు. ఫీవర్ సర్వే అంశాలతో వైద్యాధికారిణిలు ఎ.ఇంద్రావతి, జివి.గీతాంజలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-ఆలమూరు

సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలకు మండల పరిధి 18 గ్రామాల్లో ఆయా ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖ అనుమతులు తప్పక పొందాలని ఎస్ఐ ఎం.అశోక్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ ప్రదేశాల్లో నిర్వహించ తలపెట్టిన వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ సూచించారు. ఈ ఏడాది చవితి ఉత్సవాల వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలు చేసిందన్నారు. వినాయక చవితి ఉత్సవాల వల్ల ఎదుటి వారికి ఇబ్బందులు కలగ కూడదని, పందిళ్ల ఏర్పాటు కోసం వినాయక ఉత్సవ కమిటీలు ganeshutsav.net కు గాని ఫోన్ నెంబర్ 7995095800 వాట్సాప్ నంబర్ ను అనుమతి కోసం సంప్రదిస్తే మీ నంబర్ కు వచ్చే లింక్ పై క్లిక్ చేసిన తరువాత మీకు ఓటిపి వస్తుందని వివరించారు. ఆ తరువాత అనుమతి కోరుతూ దరఖాస్తు కోసం గూగుల్ ఫారం ఓపెన్ చేసి అందులో ఉన్న కాలమ్స్ ను పూర్తి చేసిన తర్వాత ఆ దరఖాస్తు ఆధారంగా పోలీసుల విచారణ చేసి సింగిల్ విండో పద్ధతి ప్రకారం అనుమతి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పోలీస్ నిబంధనల ప్రకారం ఇచ్చిన అనుమతి క్యూఆర్ కోడ్ పత్రాన్ని మందిరం ఆవరణంలో అతికించాలన్నారు. నిమజ్జన సమయంలో కమిటీ సభ్యులు జాగ్రత్తలు వహించాలన్నారు. **ఆత్రేయపురం** వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల్లో జరగబోయే వినాయక చవితి ఉత్సవాలను పండుగ వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్ఐ సూచించారు. ఈ ఏడాది చవితి ఉత్సవాల వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలు చేసిందని వివరించారు.

శ్యాం ఫ్యామిలీకి సేవా పురస్కారం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

శ్యాం మ్యాజిక్ ఫ్యామిలీ శ్రీ కాశీ అన్నపూర్ణ సేవ పురస్కారాన్ని అందుకున్నారు. ర్యాలి గ్రామానికి చెందిన శ్యామ్ జాదుగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ రావులపాలెం రెడ్డి కళ్యాణ మండపంలో కాశీ అన్నపూర్ణ సేవా సమితి వారి సేవా పురస్కారాన్ని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, రాష్ట్ర తెలుగు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల రామకష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. శ్యామ్ ఫ్యామిలీ కువైట సమయం నుంచి పలు సేవా కార్యక్రమాలను చేస్తూ వస్తున్నారు. అలాగే ప్రతి శనివారం వాడపల్లి వచ్చే కాలినడక భక్తులకు అల్పాహారం ఇస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-రావులపాలెం

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం రావులపాలెంలో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ వల్ల తాము ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడతామని మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్ మ్యాన్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న తాము కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేశామన్నారు. తమ కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.